# బాగోతం

**కథ**

**తెలిదేవర భానుమూర్తి**

**మా ఊరు అటు పట్నమూ కాదు. ఇటు పల్లెటూరూ కాదు. పూర్వం మా ఊరును నవనాథ సిద్ధాపురం అని పిలిచేవారు. మా ఊళ్లో ఒక గుట్ట ఉంది. ఆ గుట్టను సిద్ధుల గుట్ట అని పిలుస్తారు. ఆ గుట్టలోని ఒక గుహలో శివ లింగం ఉంది. తొమ్మిది మంది సిద్ధులు ఆ శివలింగాన్ని కొలిచేవారని పెద్దలు చెబుతుంటారు. ప్రస్తుతం మా ఊరును ఆర్మూర్ అని పిలుస్తున్నారు.**

ఊరి చివర కెనాల్ ఉంది. కెనాల్ దాటాక పెరికేట్ వస్తుంది. ఇప్పుడు పెరికేట్ కూడా మా ఊళ్లోనే కలిసిపోయింది. చుట్టుపక్కల ఉన్న ఊళ్లలో చిందుబాగవతులున్నారు. ఒకప్పుడు వారు బాగా ఉండేవారు. ఏ చీకూ చింతా లేకుండా జీవితాన్ని గడిపేవారు. కనీసం వారానికి ఒకసారైనా వారు బాగోతమాడేవారు. అందరూ వారిని ఆరాధన పూర్వకంగా చూసేవారు. వారు బాగోతమాడుతున్నారంటే ఊరు ఊరంతా చూడ్డానికి వెళ్లేది. పక్కఊళ్ల నుంచి కూడా బళ్లు కట్టుకొని బాగోతం చూడ్డానికి జనం వచ్చేవారు.

నా చిన్నతనంలో చిందుబాగోతమంటే పడిచచ్చేవాడిని. అమ్మా! నాన్నా తిట్టినా వినకుండా చిరుచాప తీసుకొని చిందుబాగోతం చూడ్డానికి స్నేహితులతో కలిసి వేళ్లేవాడిని. ఒక్కోసారి మా అమ్మా! నాన్నా కూడా బాగోతం చూడ్డానికి వచ్చేవారు. మా బడి దగ్గర పెద్ద మర్రిచెట్టు ఉంది. ఆ చెట్టు కింద చెక్కబల్లలు వేసి బాగోతం ఆడేవారు. పెట్రొమాక్స్ లైట్ల వెలుగులో పట్టువస్త్రాలు, కిరీటాలు, భుజకీర్తులతో చిందుబాగవతులు ధగధగా మెరిసిపోయేవారు. కిరీటాలనూ, భుజకీర్తులనూ స్వయంగా వారే తయారుచేసుకొనే వారు. రాత్రి పదిగంటలకు మొదలైన బాగోతం తెల్లారి ఐదుగంటల దాకా జరిగేది. చాలా మంది గొంగళ్లు పరుచుకొని చక్కగా పడుకొని బాగోతం చూసేవారు. కొంత మంది వాటిమీదే ఓ కునుకు తీసేవారు. లత్కోర్ సాబ్ వొస్తె నిద్రలేపు అని కునుకు తీసే ముందు పక్కనున్న వాడితో చెప్పేవారు. 'పటే మన్మరాలా! నేను పైసలు దెచ్చిన' అని పాడుతూ లత్కోర్ సాబ్ రాగానే అందరూ నవ్వేవారు.

పెరికేట్‌లో చిందు యాదయ్య ఒక గుడిసెలో ఉండేవాడు. అతని కొడుకు సిద్ధయ్య మా బళ్లోనే ఐదోతరగతి చదివేవాడు. ఐదోతరగతి తరువాత వాడు చదువు మానేశాడు. బాగోతాలు ఆడ్డం మొదలు పెట్టాడు. వాడు నాకు మంచి స్నేహితుడు. బాగోతాల్లో వాడు చిన్ని కృష్ణని వేషం కట్టేవాడు. వాడి వేషం చూడ్డానికైనా నేను బాగోతానికి వెళ్లేవాడిని. సిద్ధయ్య, నాకు జిన్‌గన్నలను పట్టి ఇచ్చేవాడు. ఆరుద్రపురుగుల్ని అగ్గిపెట్టెలో పెట్టి మేం ఆడుకునే వాళ్లం. ఆదివారం వొస్తె సిద్ధులగుట్ట ఎక్కేవాళ్లం. కెనాల్లో ఈతలు కొట్టేవాళ్లం. గిల్లిదండ ఆడేవాళ్లం. ఆటలయ్యాక వాళ్ల గుడిసెకు వెళ్లేవాళ్లం. గుడిసె ముందున్న నులకమంచం మీద కూచుని సిద్ధయ్య వాళ్లమ్మ పెట్టిన జొన్నరొట్టెల్ని, ఎల్లిగడ్డ తొక్కుతో తినేవాళ్లం.

అది వేసవి కాలం. రైతులకు అంతగా పొలం పనులు లేవు. ఆ రోజు రాత్రి పూట మర్రిచెట్టు కింద భూకైలాస్ బాగోతం మొదలయ్యింది. చల్లగా గాలి వీయసాగింది. వెన్నెల వొళ్లు విరుచుకుంటున్నది. కొందరు పోరగాల్లు శెనగలు, బటానీలు, పల్లీలు తెచ్చుకున్నారు. వాటిని తింటూ బాగోతం చూడసాగారు. మండోదరి వచ్చింది.

'మండోదరినీ మయుని కూతురుని
సొగసుల రాణిని నే పూబోణిని
తయ్యకు తాధిమి తాకు తాధిమి
తయ్యకు తయ్యకు తయ్యకు తా'

అంటూ మండోదరి వేషం గట్టిన చిందు యాదయ్య తాళబద్ధంగా నాట్యం చేస్తున్నాడు.



"అరేయ్ గిసుంటి పెండ్లాం ఉంటె ఎంత బాగుండురా" అని ఒకడు, పక్కనున్నవాడితో అన్నాడు.

ఒకసారి మా ఊళ్లో కృష్ణరాయబారం బాగోతం ఆడారు. అడవిలో కాలం గడుపుతున్న పాండవుల వద్దకు కృష్ణుడు వెళ్లాడు. అతణ్ని చూడగానే-

"రా! బావా! రా!" అంటూ ధర్మరాజు సాదరంగా ఆహ్వానించాడు.

"ఏం ధర్మయ్యా! మీరంత బాగున్నరా"

"ఇగో గిట్లున్నం"

" వొద్దువొద్దంటె మీ పాలోల్లతోని పచ్చీస్ ఆట ఆడ్తివి. రాజ్జెం పోడగొట్టుకుంటివి"

"గయన్ని గిప్పుడు ఎందుకు గని నువ్వెందుకు వొచ్చినవో జెప్పరాదు" అని మీసాలను మెలివేస్తూ భీముడు అడిగాడు.

"పంచాతిని తశ్వజేసెతందుకు మీ పాలోల్ల తాన్కి బోయెుద్దామనుకుంటున్న." అని కృష్ణుడు చెప్పాడు.

"ఎంతైన గాల్లు మా పాలోల్లే. గాల్లు మేము కొట్లాడితె ఏమొస్తది? మాట ముచ్చటతోని మా నడ్మ పంచాతిని తశ్వజేస్తివా అంటె బాగుంటది" అని ధర్మరాజు అన్నాడు.

"కోషిస్ జేస్త. బీమయ్యా! నువ్వె జెప్పెద్దేమన్న ఉన్నదా?"

"గాల్లకు మాకు ఎట్లన్న విద్దం అయితది. నా గూటంతోని దురివోదనుగాని తొడల్ బల్గ జీర్తనని జెప్పు" అని భీముడు అన్నాడు.

"చెబ్బాస్! మొగోడంటె నీ లెక్క ఉండాల బావా! వర్జునా! నువ్వే మంటవు?"అని కృష్ణుడు అడిగాడు.

"ముందుగాల్ల మాటముచ్చటతోని మా పంచాతిని తశ్వజేసెతందుకు కోషిస్‌జెయ్యి. మా రాజ్జెం మాకియ్యకుంటె నా బానం పుల్లలతోని గాల్ల డొక్కలల్ల గొడ్తినా అంటె పెండ్లాం పిల్లలకు గాకుంట బోతరని జెప్పు" అని అర్జునుడు అన్నాడు.

"మీ అన్న వొచ్చి గింత సేపైనా మొకం జూస్కుంట నిలబడ్డవేంది? కడక్ చాయ్ బెట్టు" అని ధర్మరాజు, ద్రౌపదికి చెప్పాడు.

అతని మాట మేరకు ద్రౌపది ఛాయ్ జేసింది. కప్పుల్లో పోసి తీసుకువచ్చింది. తలా ఒక కప్పు ఛాయ్ ఇచ్చింది. భీముడు ఛాయ్ తాగి తూ!తూ! అని ఉమ్మివేశాడు.

"ఇంట్ల నా పెండ్లాం ఎట్లన్న చాయ్ మంచిగ జెయ్యదు. బాగోతంల గూడ గిసుంటి చాయ్ ఇస్తవా?" అంటూ భీముడు, ద్రౌపదిని కొట్టబోయాడు.

కృష్ణుడు, ధర్మరాజు సర్దిచెప్పడంతో భీముడు శాంతించాడు. అతని కోసం స్పెషల్ ఛాయ్‌ని తెప్పించారు. కృష్ణరాయబారం బాగోతంలో యాదయ్య

కృష్ణుని వేషం కట్టేవాడు. కృష్ణుడంటే ఇలాగే ఉంటాడేమోనని మా ఊరువాళ్లు అనుకునేవారు. ఒకామె అయితే అతడిని మోహించింది. కృష్ణుని వేషంతోనే వాళ్ల ఇంటికి రమ్మని కోరింది.

ఉద్యోగరీత్యా ప్రస్తుతం నేను పట్నంలో ఉంటున్నాను. ఏ పండక్కో తప్ప మా ఊరికి వెళ్లడం లేదు. మా ఊరు యాదికొస్తే సిద్దయ్య యాదికొస్తాడు. సిద్దయ్య యాదికొస్తే చిందుబాగోతం యాదికొస్తుంది. అతణ్ని చూసి ఎన్నో ఏళ్లయ్యింది. దసరా పండక్కి మా ఊరు వెళ్లాను. సాయంత్రం పాల పిట్టను చూడ్డానికి పెరికేట్ వైపు వెళ్లాను.

"పంతులూ! పంతులూ!" అని ఎవరో పిలిచినట్లనిపించింది.

వెనక్కి తిరిగి చూసాను. బీడీ కాలుస్తున్న ఓ వ్యక్తి కనిపించాడు. అతని మొహం పీక్కుపోయి ఉంది. బతుకు బరువును మోయలేక మోయలేక మోస్తున్న వాడిలా ఉన్నాడు. నువ్వెవరివి? అని ప్రశ్నార్థంగా అతని వైపు చూసాను.

"నేను పంతులూ సిద్దయ్యను" అని అతను అన్నాడు.

"నువ్వా! సిద్దయ్యా! బాగున్నవా?" అని అడిగాను.

"ఏం చెప్పుమంటవు. ఒక్క పూట బువ్వుంటె ఇంకో పూట ఉపానముంటున్నం"

"ఏంది? గిప్పుడు మీరు చిందు బాగోతం ఆడ్తలేరా?" అని అడిగాను.

"ఇయ్యాల్రేపు మా బాగోతంను ఎవ్వలు జూస్తరు పంతులూ" అని సిద్దయ్య అన్నాడు.

"ఒక్కపారి మీ నాయిన పాడేటి మండోదరినీ పాట బాడరాదు"అని అన్నాను.

మండోదరినీ మయుని కూతురునీ అంటూ సిద్దయ్య పాడాడు. ఓ పదిరూపాయలు తీసి అతని చేతిలో ~ఎట్టాను. వద్దంటూనే అతను తీసుకొన్నాడు.

అతని పరిస్థితి చూస్తే నా మనసంతా వికలమైంది. చిందుబాగోతుల పరిస్థితి అంతా ఇలాగే ఉందేమోననిపించింది. వారు ఎలా బతుకుతున్నారో ఏమో!

"టి.విలు, సిన్మలు జెయ్యబట్కె మీ చిందుబాగోతంను ఎవ్వలు జూస్తలేరా?" అని అడిగాను.

"మన లీడర్ల మొకాలకు రంగు బూస్కోకుంటనే దినామొక బాగోతం ఆడ్తుంటె మా బాగోతాలు ఎవ్వలు జూస్తరు పంతులూ!" అని సిద్దయ్య అన్నాడు. ●

# జాషువా సంస్మరణే దళిత సాహిత్య గుర్తింపుకాదు

ప్రతిస్పందన

అక్టోబరు 12 ఆదివారం వార్తలో అచ్చయిన 'అవగాహన విస్తృతికి జనకవనం' వ్యాసానికి సమాధానంగా 'దళిత జనాలు లేని జనకవనం' పేరుతో ఆ వ్యాసంలోని కొన్ని అవాస్తవాలను పాఠకుల ముందు ఉంచాం. మా వ్యాసానికి సమాధానంగా నవంబరు 9 సంచికలో సాహితీ స్రవంతి కన్వీనర్ తెలకపల్లి రవి 'స్రవంతి ఒక విశాల వేదిక' పేరుతో వివరణ ఇచ్చారు. ముందుగా మా భావాలను గౌరవించినందుకు రవిగారికి దళిత సాహితీ మిత్రుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం!

'జనసాహిత్య సమ్మేళనం' కరపత్రం చూసిన వెంటనే ఒకరిద్దరు దళిత రచయితలు ఈ కార్యక్రమంలో దళిత సాహిత్యానికి చోటు లభించని అంశాన్ని నిర్వాహకుల దృష్టికి తెచ్చారు. దానికి వారు హైదరాబాద్‌లో పెద్దగా దళిత సాహితీవేత్తలు ఎవరున్నారు? గతంలో ఒకరిద్దరి పేర్లు కార్యక్రమంలో పెట్టినా వారు రాలేదు అనే కారణాలు చెప్పారు. సరే! సంస్థ వారిది, వారి యిష్టప్రకారంగా కార్యక్రమాన్ని రూపొందించుకునే హక్కు వారికి వుందని సరిపెట్టుకున్నాం! కానీ దళిత సాహిత్యానికి చోటు యివ్వకుండానే, ఈ కార్యక్రమం 'విభిన్న దృక్పథాల వారికి వేదికగా నిలిచింది, అని జి.ఎస్.గారు పాఠకులకు తప్పుడు సమాచారం ఇవ్వడాన్ని మేం మా స్పందనలో ప్రశ్నించాం.

అయితే సాహితీ స్రవంతి నిర్వహించిన 'జనసాహిత్య సమ్మేళనం' దళిత సాహిత్యాన్ని విస్మరించిందని రవిగారు తమ వ్యాసంలోని ఈ కింది వాక్యాల వల్ల పరోక్షంగా అంగీకరించినట్లయింది. "నేటి సంక్లిష్ట సామాజిక పరిస్థితుల్లో ప్రపంచీకరణను, మతోన్మాదాన్ని, టెర్రరిజాన్ని వ్యతిరేకించే సాహిత్యకారుల మధ్య సాధ్యమైనంత విశాలస్థాయిలో చర్చకు, సృజనకు అవకాశం కలిగించేందుకే సాహితీ స్రవంతి కృషిచేస్తోంది". రవిగారి "విశాలస్థాయి"లో కులోన్మాదంగానీ, కులవివక్షగానీ వాటిని ప్రతిఘటించి ప్రశ్నించే దళిత సమస్య ప్రస్తావనగానీ లేకపోవడం గమనార్హం. పైవాక్యాల్లోని జాబితాను చూస్తే అందులో కుల సమస్యకు చోటు లభించలేదని స్పష్టమౌతుంది. "ఆ సందర్భంలోనూ ఇతరత్రాను ప్రస్థానంలోనూ దళితవర్గాల సమస్యలు, సాహిత్యం పుష్కలంగా ప్రాతినిధ్యం పొందాయి" అని కూడా రాసారు. ప్రస్థానంలోనే కాదు ఏ సాహిత్య పత్రికలో అయినా దళిత సాహిత్యం ప్రచురిస్తున్నారంటే అది సాహిత్య యుగధర్మాన్ని పాటించడమే. అంతకంటే అది పత్రికల బాధ్యత, అవసరం కూడా అని గమనించాలి. తెలుగులో ప్రధాన సాహిత్య స్రవంతిగా వున్న దళిత బహుజన సాహిత్యాన్ని ప్రచురించకపోతే అది ఆయా పత్రికల వెనకబాటుతనాన్ని తెలియచేస్తుందే తప్ప మరొకటికాదు. జాషువా సంస్మరణ సభ జరిపిన స్రవంతి జనసాహిత్య సమ్మేళనంలో దళిత సాహిత్యానికి ఎందుకు చోటివ్వలేదు? రెండురోజుల సదస్సుకు అనంతపురం, తిరుపతి, ఖమ్మం వంటి దూరప్రాంతాల నుండి వక్తలను ఆహ్వానించిన స్రవంతికి కనీసం హైదరాబాద్‌లోని దళిత సాహిత్యకారులు ఎందుకు కనిపించలేదు? అన్న మా ప్రశ్నలకు రవి సమాధానాలు దాటవేసారు. దళిత సాహిత్యాన్ని గుర్తించామని చెప్పుకోడానికి కేవలం జాషువా సంస్మరణ సభ మాత్రమే సరిపోదని మా అభిప్రాయం. "అన్నిరకాల భావాలు ప్రతిధ్వనింపచేయడం తప్ప దేనికీ ఎవరినీ అధికార ప్రతినిధులుగా ఆహ్వానించలేదు' అన్నారు. పోనీ అలాగే అనుకున్నా ఆ "అన్నిరకాల భావాల"లో దళిత భావం ఎందుకు ప్రతిధ్వనించలేదని మా ప్రశ్న. చెయ్యని పనిని చేసామని చెప్పుకోవడంపట్ల మాత్రమే మా అభ్యంతరం. ఒక్కదళిత సాహిత్యాన్నేకాదు సమకాలీన సాహిత్య ధోరణులకు చోటు కల్పించినప్పుడు మాత్రమే స్రవంతి విశాల వేదిక కాగలదు. దళితులతో నడిచివచ్చే ఏ వేదికైనా పంచుకోడానికి దళిత సాహితీమిత్రులు ఎప్పుడూ సిద్ధమే. అలాంటి వేదికలకు మా హృదయపూర్వక స్వాగతం.

– దళిత సాహితీమిత్రులు, హైదరాబాద్

---

# తుడుం

ఉరికొయ్యను
ఉరితీసిన ఉచ్చులు

పాడెను
కబళించిన పీనుగు

కొరివిని
రగిలించిన కాష్ఠం

కలశాన్ని
మింగిన చితాభస్మం

మబ్బులు
ఆకాశాన్ని వర్షిస్తున్నాయా

విస్కీలో
వర్షాన్ని తాగుతున్న మైకం
అదిగో

కెరటాలకు
తీరం ఎదురెక్కుతున్నది

జాలరి వలలకు
చేపలు ఎరలేస్తున్నయ్

తూరుపు దిక్కున
కసాయి కత్తుల
బలులిస్తుంద్రట

రేపటి పొద్దును
పడమట మొలిపిస్తుంద్రట

– బైరెడ్డి కృష్ణారెడ్డి